


జై..హనుమాన్

చైత్రశుద్ధ పౌర్ణమి సందర్భంగా మంగళవారం పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని మైసూరు రోడ్డు హనుమాన్ ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.



28 నుంచి రాష్ట్రంలో ప్రధాని మోదీ సుడిగాలి పర్యటన

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రెండో విడత లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా రెండు రోజులు రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేపట్టనున్నారు. ఈనెల 28న దావణగెరె, కారవార, బెళగావి పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు. రాత్రి బెళగావిలో బస చేస్తారు. 29న విజయపుర, కొప్పళ, కలబురగి అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత జిల్లా కలబురగికి ప్రధాని రావడం ఇది రెండోసారి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక నామినేషన్లకు ముందే ప్రధాని కలబురగిలో ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్నారు. రెండు రోజులపాటు ప్రధానమంత్రి రాష్ట్రంలో పర్యటించేవేళ ప్రతి బహిరంగసభలోనూ రెండు నియోజకవర్గాల ప్రజలు, అభ్యర్థులను భాగస్వాములు చేస్తున్నారు. దీన్నిబట్టి టార్గెట్ 12 నియోజకవర్గాలను రెండు రోజుల్లో పూర్తి కానుంది. రెండో విడత పోలింగ్ మే 7న జరుగుతుండగా తొలి విడత పోలింగ్ ఈనెల 26న పూర్తి కాగానే, ప్రధాని రాష్ట్రానికి వస్తున్నారు.



నేటితో ప్రచారానికి తెర

- తొలివిడత ఎన్నికలకు అంతా సిద్ధం
- హోరాహోరీగా సాగిన ప్రచారం
- రాష్ట్రానికి పెరిగిన అగ్రనేతల తాకిడి
- కీలక స్థానాల్లో పోలింగ్‌తో నేతల్లో పెరిగిన ఉత్కంఠ



దివ్యాంగులకు ప్రత్యేక వీల్‌చెయిర్

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తొలి విడత ప్రచారానికి బుధవారంతో తెరపడనుంది. రాష్ట్రంలో 14నియోజకవర్గాలకు ఈనెల 26న పోలింగ్ జరగనుంది. రెండో విడత పోలింగ్ మే 7న కొనసాగనుంది. రాష్ట్రంలో 5.47 కోట్ల మంది ఓటర్లు ఉండగా 58,834 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో మహిళలకోసం ప్రత్యేకంగా పింక్ పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశారు. ఓటరు జాగృతి కోసం నిరంతరంగా అవగాహన కల్పించారు. శుక్రవారం పోలింగ్ జరిగే 14 నియోజకవర్గాల పరిధిలో 2,88,08,182మంది ఓటర్లు కాగా 1,44,17,530మంది పురుషులు, 1,43,87,585మంది మహిళలు, 3067మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. తొలివిడతలో ఉడుపి-చిక్కమగళూరు, హాసన్, చిత్రదుర్గ, దక్షిణ కన్నడ, తుమకూరు, మండ్య, మైసూరు, చామరాజనగర, బెంగళూరు గ్రామీణ, ఉత్తర, సెంట్రల్, దక్షిణ, చిక్కబళ్ళాపుర, కోలారు స్థానాలు ఉన్నాయి. 247మంది అభ్యర్థులు బరిలో ఉండగా 226మంది పురుషులు, 21మంది మహిళలు ఉన్నారు. తొలి విడత సమరంలో మాజీ సీఎం కుమారస్వామి, కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, యదువీర్, డాక్టర్ సీఎన్ మంజునాథ్, డీకే సురేశ్ తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా సాగిన ప్రచారం

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. రెండు పార్టీలకు దక్షిణాదిలో శక్తి కలిగినది కర్ణాటకలో కావడంతో అధిష్ఠానం కూడా ప్రత్యేక దృష్టి సారించింది. నామినేషన్ల ముందు నుంచే ప్రచార హోరు కొనసాగింది. బీజేపీ అభ్యర్థులకోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, జేపీ నడ్డా, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ సహా పలువురు కేంద్రమంత్రులు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ తరఫున అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భాగస్వాములయ్యారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ 14 నియోజకవర్గాల్లో సుడిగాలిలా తిరిగారు. ఇద్దరికీ సొంత జిల్లాలు ఉండడంతో ప్రతిష్ఠాత్మకంగా భావించారు. సీఎం సిద్దరామయ్య, మైసూరు అభ్యర్థి లక్ష్మణ్, చామరాజనగర్ అభ్యర్థి సునిల్ బోస్‌ల గెలుపుకోసం తాలూకాస్థాయిలో సభలు జరిపారు. ఇక డీసీఎం డీకే శివకుమార్‌కు పెద్ద సవాల్‌గా బెంగళూరు గ్రామీణ నిలిచింది. ఆయన తమ్ముడు డీకే సురేశ్ బరిలో ఉండడం, అతడికి ప్రత్యర్థిగా బీజేపీ నుంచి నాలుగు దశాబ్దాలపాటు వైద్యవృత్తిలో తిరుగులేని పేరు సాధించిన డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభ్యర్థి కావడంతో పోటీ హోరాహోరీగా మారింది. ఇక మండ్యలో రాజకీయ ప్రత్యర్థి కుమారస్వామిని దెబ్బతీసేందుకు అడుగడుగునా వ్యూహాలు పన్నారు. హాసన్‌లో జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ మనుమడు ప్రజ్వల్ మరోసారి పోటీ చేయడంతో ఇక్కడ ప్రతిష్ఠాత్మకమైంది. ప్రచారంలో దేవెగౌడ ఆరోగ్యం, వయోభారాన్ని లెక్క చేయకుండా సుడిగాలిలా తిరుగుతున్నారు. నిత్యం ఓ సభలో పాల్గొంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో కలసి బెంగళూరు, మైసూరు సభలలో దేవెగౌడ వేదిక పంచుకున్నారు. ఇలా నిత్యం ఉత్కంఠగా సాగిన ప్రచారానికి మరో కొన్ని గంటల్లో తెరపడనుంది.



యువత కోసం ప్రత్యేకంగా పోలింగ్‌బూత్ సిద్ధం



పింక్‌బూత్‌లో సిద్ధంగా ఎన్నికల సిబ్బంది



మళ్లీ బీజేపీలో చేరుతా

- పార్టీని అభివృద్ధి చేసింది నేనే
- తండ్రీ కొడుకులు కుట్ర పన్ని బయటికి పంపారు
- ఎన్నికల్లో గెలిస్తే వారే తీసుకెళ్తారు..
- యడియూరప్పపై ఈశ్వరప్ప ధ్వజం

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నేను మళ్లీ బీజేపీలో చేరుతా, ఎవరూ అడ్డుకోలేరని శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్ప సవాల్ విసిరారు. పార్టీ నుంచి సస్పెన్షన్ వేటు వేయడంపై మంగళవారం ఈశ్వరప్ప స్పందించారు. మీడియాతో మాట్లాడిన ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు అభినందనలు అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా వెనుకడుగు వేస్తారని అందరూ భావించారని, నామినేషన్ల ఉపసంహరణ ముగిశాక స్పష్టత వచ్చిందన్నారు. యడియూరప్ప, విజయేంద్ర, రాఘవేంద్రలు గందరగోళం చేసేందుకు ప్రయత్నించారని, వారికి సమాధానం లభించిందన్నారు. జగదీశ్‌శెట్టర్ బీజేపీని వీడి కాంగ్రెస్ లో చేరినపుడు కాళ్లు పట్టుకుని మళ్లీ బీజేపీలోకి తీసుకొచ్చానని అదే పరిస్థితి వస్తుందన్నారు. తాత్కాలికంగా నేను పార్టీకి దూరమయ్యానని అయితే ఆరేళ్లవేటు ఉండదన్నారు. తండ్రీకొడుకుల కుతంత్రాలతో తాను బీజేపీనుంచి బయటకు వచ్చానన్నారు. బీజేపీ గురించి తెలియని ఓ పసికూన లాంటి రాష్ట్ర అధ్యక్షుడు వేటు వేశారన్నారు. ఇది తాత్కాలికమైన పరిణామమని, తానెప్పుడూ బీజేపీని వీడేది లేదన్నారు. తన జన్మలో కాంగ్రెస్‌లోకి వెళ్లనని, మళ్లీ బీజేపీలోకి వస్తానని ఎవరూ అడ్డుకోలేరన్నారు. తనపై వేటు వేసేందుకు నామినేషన్ ఉపసంహరణ గడువు కోసం విజయేంద్ర 3 గంటలపాటు వేచి చూశారన్నారు. ఓడిన శెట్టర్‌ను పార్టీలోకి చేర్చుకున్నారని, నన్ను పిలవరా అంటూ ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన తర్వాత ఆయన తండ్రే బీజేపీకి తీసుకెళ్తారన్నారు. తాను అభివృద్ధి చేసిన పార్టీ అని, యడియూరప్ప కేజేపీని స్థాపించి మళ్లీ వచ్చినవారని ఆయన డూప్లికేట్ అని నేను ఒరిజినల్ అన్నారు. కాగా నేహా హత్య విషయంలో సీఎం, సుర్జేవాలాల వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయన్నారు. సోమవారం మరో సంఘటన చోటు చేసుకుందని, ముస్లింలను కాంగ్రెస్ వెనకేసుకొస్తోందని, రాష్ట్రం నుంచి కాంగ్రెస్‌ను తరిమికొట్టడమే పరిష్కారమన్నారు.



బెంగళూరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రియాంక గాంధీ

బీజేపీలో చేరితే మరక మాయం

- అవినీతిని కడగడానికి వాషింగ్‌మెషిన్ పెట్టుకున్నారు
- ప్రధాని ఒక్కరే సచ్ఛీలుడు అనుకుంటున్నాడు
- కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధి మండిపాటు

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎంతటి అవినీతికి పాల్పడినా సరే బీజేపీలో చేరడంతోనే నీతి మంతులవుతారని, నరేంద్రమోదీ ఒక్కరే సచ్ఛీలుడు అనుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత్రి ప్రియాంకగాంధీ మండిపడ్డారు. బెంగళూరు దక్షిణ, సెంట్రల్ కాంగ్రెస్ అభ్యర్థులు సౌమ్యరెడ్డి, మన్సూర్ అలీఖాన్‌ల తరఫున ప్రియాంకగాంధీ ప్రచారం చేశారు. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్ రెండో సెక్టార్‌లో పార్టీ కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో సామాన్యులు, మహిళలు, విద్యార్థులు, యువత, మధ్య తరగతి ప్రజల జీవనం క్లిష్టంగా మారిందన్నారు. రెండు మూడు రోజులుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల మెడలో మంగళసూత్రాలు దోచేస్తారని వ్యాఖ్యానిస్తున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో ఏళ్లు కాంగ్రెస్ పాలన సాగిందని ఎంతమంది మంగళసూత్రాలు కొల్లగొట్టారన్నారు. మా అవ్వ ఇందిరాగాంధీ బంగారం తాకట్టు పెట్టి సైనికులకోసం ఖర్చు చేశారని, నా తల్లి సోనియాగాంధీ మంగళసూత్రం భారతభూమిదన్నారు. మన దేశంలో కుటుంబ సంస్కృతి గొప్పదన్నారు. మంగళసూత్రం ప్రాధాన్యం తెలిసి ఉంటే ఇలాంటి ఆరోపణలు చేయరన్నారు. మణిపూర్‌లో మహిళలకు బట్టలు లాగినప్పుడు ప్రధానమంత్రికి మంగళసూత్రం విలువ గుర్తుకు రాలేదా అన్నారు. కొవిడ్ వేళ రాత్రికి రాత్రి లాక్‌డౌన్ విధించారని లక్షలాదిమంది వలస కార్మికులు ఎక్కడికక్కడ నిలిచిపోయారని, ఉపాధి కోల్పోయారని అప్పుడు మంగళసూత్రం గురించి ఎందుకు మాట్లాడలేదన్నారు. దేశంలో నిత్యావసర వస్తువులతో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. కొన్నాళ్లక్రితం నగరానికి వచ్చానని ఎన్నికల హామీలో భాగంగా గృహలక్ష్మి ఇస్తామని చెప్పానన్నారు. రాష్ట్రంలో 1.25 కోట్లమందికి గృహలక్ష్మి అందుతోందని, గృహజ్యోతి, అన్నభాగ్య, శక్తి గ్యారెంటీలు సామాన్యవర్గాలకు ఆర్థిక తోడ్పాటు ఇస్తున్నాయన్నారు. దేశమంతటా గ్యారెంటీలు అందించి మధ్య, పేదవర్గాలకు అండగా నిలవదలిచామన్నారు. దేశంలో నిత్యావసర ధరలు, రాజకీయాలు పెను సమస్యలుగా మారాయన్నారు. నిరుద్యోగం పెరుగుతోందని, వస్తువుల ధరలు అందుబాటులోకి రావడం లేదని ఇది ప్రతి ఇంటిపైనా భారం పడుతోందన్నారు. ప్రధాని మోదీ పదేళ్లలో మీకేం ఇచ్చారో మీకు ఎప్పుడూ చెప్పరన్నారు. ప్రధానమంత్రికి కొందరు మిత్రులు ఉన్నారని, వారికే విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు వంటివి కట్టబెడుతున్నారన్నారు. సామాన్యులకు బియ్యం, చిన్న చిన్న పథకాలతోనే సరిపెడుతున్నారన్నారు.

- దేశంలో మహిళా సాధికారత, సామాన్యుల సమస్యలపై స్పందించరని, పదేళ్లలో ఏం చేశామనేది చెప్పరని కానీ 400 సీట్లు గెలుస్తామని బెదిరించేలా ప్రధాని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నగరం అంటే దేశంలోనే అన్ని ప్రాంతాలకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించేదనే అభిప్రాయం ఉందన్నారు. జనాభా పెరిగిందని, అందుకు అనుగుణంగానే కొన్ని సమస్యలు తలెత్తాయన్నారు. దేశంలో ఎక్కడాలేని స్టార్టప్‌లు ఇక్కడ ఉన్నాయన్నారు. నగరంలో ఐఐఎం, ఎన్నో విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. హెచ్‌ఏఎల్, ఇస్రో, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వరంగ సంస్థలు పనిచేసేందుకు యువత వస్తుంటారన్నారు. మరెంతకాలం హిందూ ముస్లింలంటూ నాటకాలు రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. అబద్ధాల పార్టీ కావాలా, అన్నివర్గాలకు అండగా ఉండే నాయకులు కావాలో మీరే నిర్ణయించుకోవాలన్నారు. శ్రీరాముడు అనేది నైతికతకు మార్గదర్శకులన్నారు. మహాత్మాగాంధీ చివరిశ్వాస వీడేటప్పుడు హే రామ్ అన్నారని అంటే అది నైతికతకు నిదర్శనమన్నారు.
- రాజకీయ పార్టీలకు చందాలు ఇచ్చే సంప్రదాయం ఎప్పటినుంచో ఉందని, కానీ బీజేపీకి ఎవరు ఇచ్చారో రహస్యమని ప్రియాకం అన్నారు. ఐటీ నోటీసులు, కేసులు ఎదుర్కొనేవారు బీజేపీకి చందాలు ఇచ్చారన్నారు. బీజేపీ ఓ వాషింగ్ మిషన్ పెట్టుకుందని అక్కడ బ్లాక్‌మనీ వేస్తే వైట్ అవుతుందని, ఎంతటి అవినీతి పరుడైనా బీజేపీలో చేరగానే స్వచ్ఛమైన వ్యక్తి అవుతారన్నారు. దేశంలో పటిష్ఠమైన ప్రభుత్వం కొనసాగేందుకు ఉండే రాజ్యాంగాన్ని మార్చు చేస్తామని బీజేపీ నేతలు చెబుతారన్నారు.



చిత్రదుర్గలో ప్రియాంక గాంధీకి స్వాగతం పలుకున్న సీఎం సిద్ధరామయ్య, కాంగ్రెస్ నేతలు



జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న ప్రియాంక తదితరులు



సభకు హాజరయిన జనం

కార్పొరేట్లకు రుణమాఫీ చేసిన ఘనుడు మోదీ : సీఎం

బళ్లారి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మనోమ్మహన్ సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ. 76వేల కోట్ల రుణమాఫీ చేశారని, మోదీ ప్రధాని అయితన తరువాత దేశంలో అత్యంత శ్రీమంతుల 16లక్షల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మోదీకే దక్కుతుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎద్దేవా చేశారు. చిత్రదుర్గ నగరంలో మంగళవారం ప్రజాధ్వని-2 యాత్రను ప్రారంభించిన ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలను నమ్మించి మోసం చేయడం మోదీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఉద్యోగాలు అడిగితే పకోడా అమ్ముకొండని చెప్పడం మోదీకే చెల్లుతుందన్నారు. విదేశాల నుంచి బ్లాక్‌మనీ తెస్తానని, రైతులను లక్షాధికారులు చేస్తానన్న సొల్లు కబుర్లు చెప్పడం మోదీకే చెల్లుతుందన్నారు. మోదీ పాపాలు చెప్పుకుంటే పోతే హనుమంతుడి తోకలా అవుతుందన్నారు.

సీఈటీ అభ్యర్థులకు గుడ్‌న్యూస్

- పాఠ్యేతర ప్రశ్నల పరిశీలనకు కమిటీ

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యా కోర్సుల ప్రవేశానికై నిర్వహించిన సీఈటీ పరీక్షల్లో పాఠ్యేతర ప్రశ్నలపై ప్రాధికార అధికారులు స్పందించారు. పాఠ్యేతర ప్రశ్నల లోపాలను పరిశీలించేందుకు నాలుగు కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. పాఠ్యాంశాలవారీగా నిపుణులైన అధ్యాపకులతో కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈనెల 18, 19 తేదీలలో సీఈటీ పరీక్షలు జరిగాయి. రసాయనశాస్త్ర, భౌతికశాస్త్రం, జీవశాస్త్రంలో పాఠాలతో సంబంధంలేని ప్రశ్నలు 20శాతం ఉన్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మూడు రోజులుగా మల్లేశ్వరంలోని కార్యాలయం వద్ద ఆందోళన సాగుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉన్నత విద్యాశాఖ కమిటీలను ఏర్పాటు చేసింది. ఒక్కో కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు.

అమిత్ షా రోడ్‌షోకు జనసందడి

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బెంగళూరులో మంగళవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోకు జనం తరలివచ్చారు. పశ్చిమబెంగాల్‌లో పలు కార్యక్రమాలు ముగించుకుని అమిత్‌షా ప్రత్యేక విమానంలో హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌కు రాత్రి చేరుకున్నారు. అక్కడనుంచి నేరుగా బొమ్మనహళ్ళి ప్రాంతంలో రోడ్‌షో నిర్వహించారు. కిలోమీటర్ల కొద్దీ సాగిన రోడ్‌షోకు జనం భారీగా తరలివచ్చారు. ర్యాలీ సాగినంత మేర పూలవర్షం కురిపించారు. పార్టీ ముఖ్యనేత యడియూరప్ప, బెంగళూరు దక్షిణ అభ్యర్థి తేజస్వి సూర్య, ప్రతిపక్షనేత అశోక్‌తో పాటు బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, జయనగర్ ఎమ్మెల్యే కేసీ రామమూర్తి సహా పలువురు పాల్గొన్నారు. మోదీ జిందాబాద్ అంటూ కార్యకర్తలు కేరింతలు కొట్టారు. అమిత్ షా కమలం గుర్తులు చూపిస్తూ మద్దతు ఇవ్వాలని కోరారు. మరోసారి బీజేపీని గెలిపించి దేశ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధాని మోదీకి మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. పెద్దసంఖ్యలో కళాబృందాలు పాల్గొని సందడి చేశాయి. ర్యాలీ పొడవునా కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేశారు. దారి పొడవునా పూలు జల్లి ఆహ్వానం పలికారు.



రోడ్‌షోలో అమిత్ షా, బీజేపీ నేతలు

26న బళ్లారికి రాహుల్ రాక



బళ్లారి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బాగంగా ఏప్రిల్ 26న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బళ్లారికి రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ తెలిపారు. బళ్లారిలోని మున్సిపల్ మైదానంలో అదేరోజు బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. ఆరోజు సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితర కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా హాజరు కానున్నట్టు తెలిపారు.

రాచనగరి రాజు ఎవరో..?



యదువీర్ (బీజేపీ)



లక్ష్మణ్ (కాంగ్రెస్)



● బీజేపీ అభ్యర్థిగా యువరాజు యదువీర్ ● కాంగ్రెస్ అభ్యర్థిగా ఎం. లక్ష్మణ్ ● సొంత జిల్లా కావడంతో సీఎం ప్రత్యేక దృష్టి

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాచనగరి మైసూరుకు దేశంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ప్రజాస్వామ్యం ప్రారంభమయ్యాక రాచరిక విధానాలు ఎలా ఉంటాయో కూడా తెలియని పరిస్థితి. అయితే మైసూరులో ఏటా జరిగే దసరా ఉత్సవాల వేళ రాజరికం ఉట్టిపడేలా ప్రైవేట్ దర్బార్ సహా పలు కార్యక్రమాలు ఉంటాయి. అందుకే మైసూరు దసరా ఉత్సవాలంటే ఎనలేని ప్రత్యేకత సంతరించుకున్నాయి. మైసూరులో సుదీర్ఘకాలం తర్వాత రాజకుటుంబానికి చెందిన యువరాజు యదువీర్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి అధికార ప్రతినిధి ఎం లక్ష్మణ్ బరిలో నిలిచారు. వరుసగా రెండుసార్లు బీజేపీ నుంచి ఎంపీగా ఎన్నికైన ప్రతాప్‌సింహను కాదని ఈసారి యువరాజు యదువీర్‌కు టిక్కెట్ కేటాయించారు. బీజేపీ-జేడీఎస్‌ల మైత్రితో యదువీర్ గెలుపు సునాయాసమే అనిపిస్తున్నా అంతర్గత కలహాలు ఇబ్బంది కలిగిస్తాయనే భయం నెలకొంది. కాంగ్రెస్‌కు కుల సమాజం మద్దతు ఉంటుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. 47ఏళ్ల తర్వాత ఇక్కడ ఒక్కలిగ సమాజానికి చెందినవారికి టిక్కెట్ దక్కింది. మైసూరు పరిధిలో కృష్ణరాజు, చాముండేశ్వరి, చామరాజ, నరసింహరాజ, హుణసూరు, పెరియపట్టణ శాసనసభ నియోజకవర్గాలు ఉండగా వీటిలో 3 కాంగ్రెస్, 2 జేడీఎస్, ఒక బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. ఇదే నియోజకవర్గంలో కొడగు జిల్లా అనుబంధం కావడంతో అక్కడ విరాజ్‌పేట, మడికేరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. యదువీర్‌కు రాజవంశానికి చెందినవారనే గౌరవం, కాంగ్రెస్ కంటే ముందుగానే ప్రచారం, బీజేపీకి కంచుకోట అనే పేరు, జేడీఎస్‌కు బలమైన ప్రాంతాలు కలిగి ఉండడం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హవా కలసి రానుండగా, రాజవంశానికి చెందిన వారు సామాన్యులకు అందుబాటులో ఉండరని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. పొత్తులో భాగంగా కొందరు అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ ప్రజలతో సంబంధాలు కలిగి ఉండడం, సామాన్య కార్యకర్తగా పోరాటం చేశారనే పేరు, సీఎం సిద్దరామయ్య గ్యారెంటీలు, ఎక్కువమంది పార్టీ ఎమ్మెల్యేలు, 47 ఏళ్ల తర్వాత ఒక్కలిగలకు టిక్కెట్ అనేది కాంగ్రెస్‌కు కలసి రానుండగా మోదీ హవా, స్టార్ క్యాంపైనర్‌లు లేకపోవడం మైనస్‌గా ఉంది. అయితే లక్ష్మణ్ గెలుపోటములకంటే ఈ స్థానం నుంచి కాంగ్రెస్ గెలవడం సిద్దరామయ్యకు ప్రతిష్ఠాత్మకమైంది. ఒకవేళ కాంగ్రెస్ ఓడితే సిద్దరామయ్యపై ముఖ్యమంత్రి సీటుకు భంగం కలిగే అవకాశం ఉంది.

పొంగులేటి రోడ్‌షో

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీజేపీ నేత పొంగులేటి సుధాకరరెడ్డి నగరంలోని యలహంకలో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. చిక్కబళ్ళాపుర బీజేపీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్‌షోలో అభ్యర్థి సుధాకర్, స్థానిక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్‌లతో కలసి ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా సుధాకరరెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల ప్రజలు ఆదరణ చూపుతున్నారని, మరోసారి బీజేపీకి ఓటేసి ఆదరించాలని కోరారు.



రోడ్‌షోలో పొంగులేటి సుధాకరరెడ్డి

గ్రామీణలో ఢీ అంటే ఢీ

● బెంగళూరు గ్రామీణలో హోరాహోరీ పోరు ● సోదరుడి గెలుపు కోసం డీకే శివకుమార్ కసరత్తు ● అల్లుడి విజయానికి మామ దేవెగౌడ కృషి



డీకే సురేశ్



డాక్టర్ సీఎన్ మంజునాథ్

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో అతి పెద్ద నియోజకవర్గమైన బెంగళూరు గ్రామీణలో పట్టు సాధించుకునేందుకు డీసీఎం డీకే శివకుమార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా, ఎలాగైనా గెలుపు సాధించాలని బీజేపీ-జేడీఎస్ కూటమి ప్రయత్నిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా హ్యాట్రిక్ గెలుపు సాధించిన డీకే సురేశ్ బరిలోగా ఉండగా బీజేపీ-జేడీఎస్ మైత్రి అభ్యర్థిగా డాక్టర్ సీఎన్ మంజునాథ్ బరిలో ఉన్నారు. బరిలో ఉన్న తమ్ముడిని ఎలాగైనా గెలిపించుకునేందుకు డీసీఎం డీకే శివకుమార్ తీవ్ర కసరత్తు చేస్తున్నారు. తొలిసారి రాజకీయాల్లోకి దిగిన పద్మశ్రీ గ్రహీత, జయదేవ ఆసుపత్రుల డైరెక్టర్‌గా సుదీర్ఘ కాలం కొనసాగిన డాక్టర్ సీఎన్ మంజునాథ్‌కు ప్రధాని నరేంద్రమోదీ హవా, స్వయంగా మామ అయిన జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని దేవెగౌడ అండదండలు ఉన్నాయి. బరిలో ఉన్న డీకే సురేశ్‌కు రాజకీయంగా అనుభవం ఉన్నప్పటికీ కఠినంగా మాట్లాడతారనే విమర్శలు, పాలనపట్ల వ్యతిరేకత మైనస్‌గా ఉన్నాయి. ఇక్కడ మొత్తం 27,63, 910మంది ఓటర్లు ఉండగా పురుషులు 14,06,042 మంది, మహిళలు 13,57,547మంది, ట్రాన్స్‌జెండర్‌లు 321మంది ఉన్నారు.

సురేశ్‌కు ప్రతిష్ఠాత్మకం

బెంగళూరు గ్రామీణ లోక్‌సభ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. బెంగళూరు దక్షిణ (బీజేపీ), రాజరాజేశ్వరినగర్ (బీజేపీ), ఆనేకల్ (కాంగ్రెస్), కుణిగల్ (కాంగ్రెస్), మాగడి (కాంగ్రెస్), రామనగర (కాంగ్రెస్), కనకపుర (కాంగ్రెస్), చన్నపట్టణ (జేడీఎస్)ల ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇలా ఎక్కువగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో కాంగ్రెస్ కంచుకోటగా ఉంది. 1952 నుంచి 1996వరకు కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు సాధించారు. 1996లో తొలిసారిగా హెచ్‌డీ కుమారస్వామి గెలుపొందడం ద్వారా జేడీఎస్ తన సత్తాను చాటుకుంది. అయితే 1998లో ఎం శ్రీనివాస్ బీజేపీ ద్వారా గెలుపొందారు. తిరిగి 1999లో కాంగ్రెస్ నుంచి రాజశేఖర మూర్తి, 2002 ఉప ఎన్నికల్లో దేవేగౌడ గెలుపొందడం ద్వారా రాజకీయ పునర్జన్మ లభించినట్టయ్యింది. 2004లో తొలిసారిగా మహిళా అభ్యర్థి తేజస్విని గెలుపొందారు. 2009లో బీజేపీ అభ్యర్థి సీపీ యోగేశ్వర్‌పై కుమారస్వామి విజయం సాధించారు. 2013 ఉప ఎన్నికల్లో అనితకుమారస్వామిపై డీకే సురేశ్ తొలిసారిగా గెలుపు సాధించారు. అనంతరం 2014, 2019 ఎన్నికల్లో విజయంతో హ్యాట్రిక్ ఎంపీ అయ్యారు. ఇప్పుడు మారిన రాజకీయాలతో బీజేపీ-జేడీఎస్ పొత్తు నేపథ్యంలో హ్యాట్రిక్ సాధించిన డీకే సురేశ్‌ను ఎలాగైనా గెలిపించాలని అన్న డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ శతవిధాలా కృషి చేస్తున్నారు.

హాసన్ బరిలో ప్రముఖుల వారసులు

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల్లో హాసన్ ఒకటి. బీజేపీ-జేడీఎస్ మైత్రి అభ్యర్థి ఒకవైపు, కాంగ్రెస్ నేత వారసుడు మరోవైపు బరిలో నిలిచారు. మైత్రి అభ్యర్థిగా మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ, కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ దివంగత పుట్టస్వామిగౌడ మనమడు శ్రేయస్ ఎం పటేల్ బరిలో ఉన్నారు. 1999లో దేవెగౌడ ఇదే నియోజకవర్గం నుం చి లోక్‌సభలోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ నియోజకవర్గం జేడీఎస్ కంచుకోటగా ఉండడంతో ఎలాగైనా గెలుపొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఐదేళ్లపాటు ఎంపీగా కొనసాగిన ప్రజ్వల్ రేవణ్ణ జాతీయ రహదారి ఇతర అభివృద్ధి పనులు చేశారు. అయితే ఆశించిన మేరకు అభివృద్ధి లేదనే విమర్శలు ఉన్నాయి. మైత్రి అభ్యర్థి కావడంతో ప్రధాని మోదీ హవా, మాజీ ప్రధాని దేవెగౌడ చరిష్మా కలసి రానుంది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయస్ పటేల్ గత శాసనసభ ఎన్నికల్లో తక్కువ ఓట్లతో ఓడిపోయిన సానుభూతి ఉంది. సౌమ్య స్వభావమైన వ్యక్తిత్వం, పార్టీ నాయకుల ఐక్యత కలిసొచ్చే అంశాలు. ఇక జేడీఎస్‌తో పోలిస్తే కాంగ్రెస్‌కు తగినంత ఎమ్మెల్యేలు లేకపోవడం, రాజకీయ అనుభవం లేకపోవడం ఇతడికి మైనస్‌గా ఉంది.



ప్రజ్వల్ రేవణ్ణ



శ్రేయస్ పటేల్

హాసన్ లోక్‌సభ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. శ్రావణబెళగొళ (జేడీఎస్), బేలూరు (బీజేపీ), అరసికెరె (కాంగ్రెస్), హొళెనరసీపుర (జేడీఎస్), హాసన్ (జేడీఎస్) అరకలగూడు (జేడీఎస్) సకలేశపుర (బీజేపీ), కడూరు (కాంగ్రెస్) ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 17,36,610మంది ఓటర్లు ఉండగా మహిళలు 8,72,840 మంది, పురుషులు 8,63,727మంది, ట్రాన్స్‌జెండర్‌లు 43మంది ఉన్నారు. కాగా 2019 ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ 6,76,606 ఓట్లు సాధించగా బీజేపీ అభ్యర్థి ఏ మంజుకు 5,35,382 ఓట్లు దక్కాయి. 1,41,224 ఓట్ల మెజారిటీతో ప్రజ్వల్ గెలుపు సాధించాడు. జేడీఎస్ కంచుకోటలో ఎలాగైనా పాగా వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

అధికార పార్టీకి అగ్నిపరీక్షే..

● లోక్‌సభ ఎన్నికలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పట్టు నిలుపుకుంటారా..? ● బళ్లారిలో గెలుపే ధ్యేయంగా వ్యూహాలు

బళ్లారి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్ని పరీక్షగా మారాయి. విజయనగర, బళ్లారి జిల్లాల పరిధిలో వచ్చే 8 నియోజకవర్గాల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందులో ఇద్దరు మంత్రులూ ఉన్నారు. కాంగ్రెస్ తరుపున సండూరు ఎమ్మెల్యే ఈ. తుకారాంను అధిష్ఠానం బరిలోకి దింపింది. అధికార పార్టీ విజయం కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తుంటే.. బీజేపీ అభ్యర్థి బి.శ్రీరాములు రాజకీయ భవిష్యత్తు కోసం పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ నాయకులకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగానే మారాయి.

● 2004 ముందు నుంచి బి. శ్రీరాములు రాజకీయంగా వివిధ పదవుల్లో ఉన్నారు. కౌన్సిలర్‌గా రాజకీయ ఆరంగ్రేటం చేసిన శ్రీరాములు క్రమేపీ రాజకీయంగా రాష్ట్రస్థాయికి ఎదిగారు. ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ ఎంపీగానూ ఆయన అనేక హోదాలు అనుభవించారు. అయితే ఆయన ఊహించని విధంగా 2023లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బళ్లారి నుంచి పోటీ చేసి ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి బి. శ్రీరాములు చేతిలో ఓడిపోయారు. అంతకు ముందు 2004 నుంచి రాజకీయంగా బి. శ్రీరాములు 2023 వరకూ ఎదురులేని నాయకుడుగా ఉండేవాడు. ఓటమి అంటే తెలియదు. ఎమ్మెల్యే ఎన్నికలు శ్రీరాములును అయోమయానికి గురి చేశాయి.

● బీజేపీకి బళ్లారిలో గాలి బ్రదర్స్‌తో పాటు శ్రీరాములు ఉన్నాడన్న ధైర్యం ఉండేది కానీ ఇప్పుడు ఆ ధీమా కరువయ్యింది. మోదీ హవా పైనే బీజేపీ ఆధారపడాల్సి వచ్చింది. పైగా గాలి జనార్దన్‌రెడ్డి కూడా తిరిగి బీజేపీలో చేరడంతో శ్రీరాములకు మరింత బలం పెరిగిందని కొందరు బావిస్తున్నారు. శ్రీరాములు విజయానికి బీజేపీ కార్యాకర్తలు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, బీజేపీ సంస్థలు గట్టిగానే పని చేస్తున్నాయి.

● కాంగ్రెస్ విషయానికి వస్తే బళ్లారి లోక్‌సభ పరిదిలో 8 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఏకంగా ఆరుగురు ఉన్నారు. ఇక రెండింటిలో ఒక చోట బీజేపీ, మరోచోట జేడీఎస్ ఉన్నాయి. బళ్లారి నగరం, బళ్లారి గ్రామీణం, కంప్లి, విజయనగర, కూడ్లిగి, సండూరు, హగరిబొమ్మనహళ్లి జేడీఎస్ నేమరాజ్ నాయక్, హడగలి బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానాయక్ గెలిచారు.



● కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేల్లో ఇద్దరు మంత్రులు కూడా ఉన్నారు. బళ్లారి ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర, విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అమ్మద్ ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తుకారాం విజయాన్ని అత్యంత చాలెంజ్‌గా తీసుకుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇద్దరు మంత్రులు ఉండడంతో ఎలాగైనా కాంగ్రెస్ ఎంపీగా తుకారాం గెలిపించుకురావాలని కాంగ్రెస్ అధిష్ఠానం నేతలను ఆదేశించింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, ఐదు గ్యారెంటీలు వివరిస్తూ ముందుకు పోతున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి శ్రీరాములు కూడా మోదీ నామంతో పాటు గతంలో తను బళ్లారికి చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ ముందుకు సాగు తున్నారు. మే 7న పోలింగ్ కావడంతో అభ్యర్థులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తొలి విడత ముగియ నుండంతో నాయకులు అంతా జిల్లా పైనే దృష్టి సారించే అవకాశం ఉంది. మొత్తానికి బళ్లారి ఎన్నికలపైనే రాష్ట్రమంతా దృష్టి పెట్టింది.

ఎన్నికల వేళ ఏ, బీ-ఫారాలు అంటే...



బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎక్కువగా బీ-ఫారం గురించి చర్చించుకుంటుంటారు. బీ-ఫారం దక్కినవారే ఆయా పార్టీల తరుఫున బరిలో ఉంటారు. అయితే ఏ-ఫారం అనేది కూడా ఎన్నికల్లో కీలకమైనది. ఏ పార్టీకి అభ్యర్థి అయినా నామినేషన్ దాఖలు చేసే సమయంలో బీ-ఫారం సమర్పించాల్సి ఉంటుంది. ఈ బీ-ఫారంలో అభ్యర్థి పోటీ చేస్తున్న పార్టీ, గుర్తు, అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు ఆ పార్టీ అధ్యక్షుడి సంతకం వివరాలు ఉంటాయి. ఈ బీ-ఫారం సమర్పించిన తరువాతే అభ్యర్థికి పార్టీ గుర్తింపు కేటాయిస్తారు. ఇక ఏ-ఫారాన్ని ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఏ-ఫారంలో రాజకీయ పార్టీ పేరు, ఆ పార్టీ తరుఫున పోటీచేస్తున్న అభ్యర్థుల పేరు, ఎక్కడి నుంచి బరిలో ఉన్నారనేది ఉంటుంది. ఏ-ఫారం కింద మూడు చోట్ల సంబంధిత పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. ఎవరూ ఫోర్జరీ చేసేందుకు వీలులేకుండా దరఖాస్తులో మూడు చోట్ల సంతకాలు చేయిస్తారు. అందరూ బీ-ఫారం సమర్పించిన తరువాతే అభ్యర్థుల వివరాలతో కూడిన ఏ-ఫారం ఎన్నికల కమిషన్‌కు అందిస్తాం. బీ-ఫారంలో ఉన్న పేరు వివరాలు అక్కడ పార్టీ సమర్పించిన ఏ-ఫారం సరిచూసిన తరువాతే అభ్యర్థి పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ గుర్తిస్తుంది. ఒకవేళ బీ-ఫారంలో అభ్యర్థి పేరుండి ఏ-ఫారంలో అభ్యర్థి పేరు లేకపోతే అభ్యర్థి ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లుగా గుర్తించదు. అందుకే బీ-ఫారంతో పాటు ఏ-ఫారం కూడా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంటాయి.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ ఎమ్మెల్సీ

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఎమ్మెల్సీలు బీజేపీ, జేడీఎస్‌లను వీడుతున్నారు. తాజాగా కేపీ నంజుండి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. విధానపరిషత్ సభాపతి బసవ రాజహొరట్టికు మంగళవారం రాజీనామా లేఖను సమర్పించారు. అంతకు ముందే కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే నివాసానికి వెళ్ళి ఆశీస్సులు పొందారు. అధికారికంగా బుధవారం కేపీ నంజుండి కాంగ్రెస్‌లో చేరనున్నారు. విశ్వకర్మ సమాజానికి చెందిన కేపీ నంజుండి తొలుత కాంగ్రెస్‌లో సిద్దరామయ్య అనుచరుడిగా కొనసాగారు. కొన్ని కారణాలతో దూరమై బీజేపీలో చేరారు. అక్కడి యడియూరప్పకు అత్యంత నమ్మిన బంటులా వ్యవహరించారు. ఎమ్మెల్సీగా పార్టీ అవకాశం ఇచ్చింది. ఇటీవల కొంతకాలంగా బీజేపీ వ్యవహారాలకు దూరంగా ఉంటూ వచ్చారు. వారం రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు డీకే శివకుమార్‌తో సన్నిహితంగా గడుపుతూ వచ్చి న ఆయన ఏకంగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో తొలివిడత పోలింగ్‌కు రెండు రోజుల ముందు కేపీ నంజుండి పార్టీ ఫిరాయించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇటీవలే బీజేపీకి చెందిన తేజస్విని ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరారు. జేడీఎస్ ఎమ్మెల్సీ మరితిబ్బేగౌడ రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.



ఖర్గే, డీకే శివకుమార్‌లతో కేపీ నంజుండి

రాయలు ఏలిన దుర్గం

● వ్యవసాయం, పరిశ్రమలతో ఉపాధి ● గార్మెంట్స్‌లో ప్రత్యేకత ● ఓబుళాపురం గనులతో గుర్తింపు

రాయదుర్గం, ఏప్రిల్ 23: పూర్వం పాలెగాళ్లు రాయదుర్గం కోటను పాలించేవారు. పాలెగాళ్లపై యుద్ధం చేసిన విజయనగర రాజులు వారిని ఓడించి విజయనగర సామ్రాజ్యంలో అంతర్భాగంగా చేసుకున్నారు. వారి సామ్రాజ్యంలో తిమ్మరుసు తమ్ముడు గోవిందరాయ మాత్యుడిని సామంతరాజుగా నియమించారు. అనంతరం టిప్పుసుల్తాన్ దండయాత్ర చేసి దుర్గంను ఆక్రమించాడు. టిప్పుసుల్తాన్, బ్రిటిష్ వారితో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రాయదుర్గాన్ని దత్త మండలంగా చేర్చారు. భాషా ప్రాతిపదికన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు అనంతపురం జిల్లాలో చేర్చి రాయదుర్గంను నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. గుమ్మఘట్ట మండలం భైరవానితిప్ప డ్యాం, కణేకల్లులోని చిక్కణ్ణేశ్వర చెరువులు సాగునీరు అందిస్తున్నాయి. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో తుంగభద్ర ఎగువకాలువ కింద వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. వేదావతి హగరి నది ఒడ్డును ఇసుకమేటలు విస్తరించివున్నాయి. డి.హీరేహాళ్ మండలంలో ఓబుళాపురం, సిద్ధాపురం, మలపనగుడి గ్రామాల్లో ఇనుప కొండలు విస్తరించి వున్నాయి. స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలు ఏడు దాకా వున్నాయి. రాయదుర్గంలో గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య ఎక్కువే. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలు ఉన్నాయి. వీరాపురం వద్ద ఐదు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ కేంద్రం నియోజకవర్గంలో ప్రముఖంగా వున్నాయి. రాయదుర్గంలో ఇటీవల రైల్వే జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేశారు. అభివృద్ధిలో చివరి స్థానంలో ఉంది. గతంలో ఏ శాసనసభ్యుడు చేయని రీతిలో టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన కాలవ శ్రీనివాసులు ప్రత్యేక ముద్ర పడే విధంగా శాశ్వతమైన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు.

● రాయదుర్గం నియోజకవర్గంలో 3.74 లక్షల జనాభా వుండగా అందులో 48.64 శాతం అక్షరాస్యత వుంది. నియోజకవర్గంలో వున్న ఐదు మండలాల్లో 2,61,089 మంది ఓటర్లు వుండగా పురుషులు 1,29,181 మంది, మహిళలు 1,31,873, థర్డ్ జెండర్ 35 మంది వున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 296 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 77 రెవెన్యూ గ్రామాలు, 94 గ్రామ పంచాయతీలు రాయదుర్గం మున్సిపాలిటీ, కణేకల్లు మేజర్ గ్రామ పంచాయతీలు వున్నాయి.



● 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో స్వాతంత్ర్య సమర యోధుడు గు రుమాళ్ నాగభూషణం వి జయం సాధించారు. వృత్తిరీత్యా న్యాయవాదిగా వున్న ఆయన స్వాతంత్ర్యం కోసం పోరాడి కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని ఇండలిగ్ జైలులో ఆరు నెలలు జైలు జీవితాన్ని గడిపారు. రాయదుర్గం పట్టణానికి చెందిన ఆయన హరిజనుల ఆలయ ప్రవేశం కోసం ఉద్యమాన్ని నిర్వహించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటి చేసి గెలిచిన కొద్ది రోజుల అనంతరం బళ్లారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు.

● రాయదుర్గం నియోజకవర్గంలో అత్యధికంగా వా ల్మీకులు వున్నారు. ఆ తర్వాతి స్థానంలో ఎస్సీలు, ముస్లింలు, కురుబ, యాదవులు ఉన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల ఓటర్ల తీర్పు ఎలా ఉన్నా రాయదుర్గం పట్టణంలోని ఓటర్ల తీర్పే ప్రతి ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుపై ప్రభావం చూపుతోంది. ఇప్పటి వరకు గెలుపొందిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులంతా రాయదుర్గం పట్టణంలో వచ్చిన మెజార్టీ కారణంగా గెలిచిన వారే. రాయదుర్గం పట్టణంలో చేనేత వర్గం, ముస్లింల ప్రభావం గెలుపోటములను నిర్దేశిస్తుంది.

● నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు కొన్ని ఏళ్ల పరిష్కారానికనోచుకోలేకపోతున్నాయి. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల మళ్లింపు. హంద్రీనీవా 34,36వ ప్యాకేజీ ద్వారా 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం, బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లులో రిజర్వాయర్ నిర్మాణం, ఎడారి నివారణ కోసం ఇసుక విస్తరించకుండా మొక్కల పెంపకం, హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు, గోనబావిలో రూ. 40 కోట్లతో చేపట్టిన బీసీ గురుకుల పాఠశాల నిర్మాణం, బాలికల జూనియర్ కళాశాల పక్కాభవనం, టెక్స్‌టైల్స్ పార్కులో యూనిట్ల ఏర్పాటు, సీఎఫ్‌సీ సెంటర్ ప్రారంభంతో నిరుద్యోగ యువతకు శిక్షణ, రాయదుర్గం పట్టణంలో పుట్టప్పతోట డిస్పోజల్ డ్రైన్ నిర్మాణం లాంటి పనులు జరగాల్సి వున్నాయి. అదేవిధంగ కణేకల్లులో డిగ్రీ కళాశాల నిర్మించాల్సి వుంది.

● అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాలో కరువు ఆనవాళ్లు మాత్రం ఇక్కడే కనిపిస్తాయి. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో రెండు వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో ఇసుకమేటలు విస్తరించాయి. వేదావతి హగరి నది పరివాహక ప్రాంతంలో విస్తరించిన వీటిని శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి జిల్లాలో కరువు ఛాయలు ఇక్కడే ప్రారంభమయ్యాయని నిర్ధారించారు. వీటిని కట్టడి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసినా అంతగా సత్ఫలితాలు ఇవ్వడంలేదు. దీని ప్రభావానికి లోనైన 10 గ్రామాలు ప్రతి యేటా ఆషాఢమాసంలో వీచే గాలులకు తీవ్ర అవస్థలు పడుతుంటాయి.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

శ్రీ సత్యసాయిబాబా (వర్ధంతి)



గురువుగా, వేదాంతిగా, భగవంతుడి అవతారంగా విశ్వసించబడే సత్యసాయి బాబా 1926 నవంబరు 23న పుట్టపర్తిలో జన్మించారు. 20వ శతాబ్దంలో పేరొందిన ఆధ్యాత్మిక గురువు. అసలు పేరు సత్యనారాయణ రాజు. ప్రపంచ వ్యాప్తంగా 166 దేశాలలో 10వేల సత్యసాయి సేవా సంస్థలు ఉన్నాయి. సత్యసాయి విద్యా సంస్థ దేశంలో నాక్‌చే ఏ++ రేటింగ్ పొందిన ఒకే ఒక సంస్థ. కాగా 220 పడకలతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉంది. సంస్థల ఆధ్వర్యంలో విద్య, సేవా కార్యక్రమాలు సాగుతున్నాయి. 2011 ఏప్రిల్ 24న నిర్యాణం చెందారు.

నండూరి రామమోహనరావు (జయంతి)



తెలుగు పాత్రికేయుడిగానే కాక రచయితగా కూడా పేరొంది సుదీర్ఘకాలం 'ఆంధ్రజ్యోతి' పత్రిక సంపాదక బాధ్యతలు వహించిన నండూరి రామమోహనరావు 1927 ఏప్రిల్ 24న కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలో జన్మించారు. సామాన్యులకు సైన్సు సంగతులు పరిచయం చేయడంలో వీరి కృషి అపారం. మిత్రలాభం, మిత్రభేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నండూరి మాటలు అందించారు. గౌరవ డాక్టరేట్, ఉత్తమ జర్నలిస్టు అవార్డు, మద్రాసు తెలుగు అకాడమీచే 'ఉగాది వెలుగు', కళాసాగర్, శిరోమణి, ఇతర అవార్డులు పొందారు. 2011 సెప్టెంబరు 2న కన్నుమూశారు.

డాక్టర్ రాజ్‌కుమార్ (జయంతి)



కన్నడ కంఠీరవుడు, పద్మభూషణ్ గ్రహీత డాక్టర్ రాజ్‌కుమార్ 1929 ఏప్రిల్ 24న గాజనూరు ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు సింగనల్లూరు పుట్టస్వామయ్య ముత్తురాజు. కన్నడ సినీ రంగానికి వన్నె తేవడమే కాక కన్నడ భాషకోసం ఎంతో పాటుపడ్డారు. 'అణ్ణావ్రు' (అన్నగారు) అని అభిమానులచే పిలవబడ్డారు. బంగారద మనుష్య, కస్తూరి నివాస, గంధద గుడి, జీవన చైత్ర వంటి సినిమాలు హిట్‌గా నిలిచాయి. 50ఏళ్లలో 200 సినిమాలలో నటించారు. వర నట, గానగంధర్వ, రసికర రాజా, రాజన్నగా పేరొందారు. తన పాటలు తానే పాడుకున్న నటుడు. నేపథ్య గాయకుడిగా ఇతర నటులకు గాత్రదానం చేశారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఎన్టీఆర్ అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. 76వ యేట 2006 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

ఏడిద నాగేశ్వరరావు (జయంతి)



తెలుగు సినీ రంగంలో పేరొందిన నిర్మాత ఏడిద నాగేశ్వరరావు 1934 ఏప్రిల్ 24న తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో జన్మించారు. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ సంస్థ అధినేత. డ్రామా నటుడిగా కెరీర్ ప్రారంభించి వెండితెరపై నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా తదుపరి సినీ నిర్మాణరంగంలో అడుగుపెట్టారు. శంకరాభరణం, స్వయంకృషి, స్వాతిముత్యం, తదితర క్లాసికల్ టచ్‌తో కూడిన సినిమాలు నంది అవార్డులు, నేషనల్ అవార్డులు సాధించడంతోపాటు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడ్డాయి. నంది అవార్డుల కమిటీ చైర్మన్‌గా, నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. 2015 అక్టోబరు 4న కన్నుమూశారు.

సచిన్ టెండూల్కర్ (పుట్టినరోజు)



అభిమానులచే 'క్రికెట్ దేవుడి'గా, లిటిల్ మాస్టర్‌గా పిలవబడే సచిన్ రమేశ్ టెండూల్కర్ 1973 ఏప్రిల్ 24న బాంబేలో జన్మించారు. గొప్ప బ్యాట్స్‌మన్‌గా క్రికెట్ చరిత్రలో ఒక చరిత్ర సృష్టించారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో వంద సెంచరీలు చేసిన ఏకైక క్రీడాకారుడు. వన్డేలలోనూ తొలిసారి డబుల్ సెంచరీ చేశారు. టెస్టు మ్యాచులు, వన్డేలలోనూ 30వేల పరుగులు మైలురాయిని అధిగమించారు. పద్మశ్రీ, పద్మభూషణతోపాటు పిన్నవయస్సులోనే 'భారతరత్న' అందుకున్న ఏకైక క్రీడాకారుడు. రాజ్యసభకు నామినేట్ అయ్యారు. పలు గౌరవ పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఆయన ఆటో బయోగ్రఫీ 'ప్లేయింగ్ ఇట్ మై వే' లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌చే 'గ్రూప్ కేప్టెన్' గౌరవ హోదా దక్కించుకున్న తొలి క్రీడాకారుడు.

ఘనంగా జంబులింగేశ్వర స్వామి రథోత్సవం

విడపనకల్లు, ఏప్రిల్ 23: మండలంలోని హావళిగి గ్రామంలో జంబులింగేశ్వరస్వామి రథోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తెచ్చి రథంలో కొలువు దీర్చారు. అనంతరం భక్తులు రథాన్ని ఆలయం వద్ద నుంచి గౌరమ్మ దేవాలమం వద్ద వరకు లాగారు. తిరిగి జంబులింగేశ్వర ఆలయం చేరుకోవటంతో రథోత్సవ వేడుకలు ముగిశాయి. అలాగే వీ కొత్తకోట రోడ్డులో వెలసిన పొదరాళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్‌జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి, ఆకు పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్న దానం చేశారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

సంబరంగా నగరేశ్వరస్వామి రథోత్సవం



నగరేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవానికి ముందు ఉత్సవమూర్తులకు పూజలు

విజయపుర, ఏప్రిల్ 23: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని హరి-హర కేంద్రంగా ఉన్న నగరేశ్వరస్వామి, ఆదినారాయణస్వామిల రథోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో సంబరంగా సాగింది. వేలాదిమంది భక్తులు హరహర మహదేవ, గోవింద నామ స్మరణల నడుమ రథోత్సవం కొనసాగింది. సాంకేతికంగా ఎంతో ప్రగతి సాధించినా సాంస్కృతిక, ఆధ్యాత్మిక అంశాలతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని నగరేశ్వరస్వామి ఎడ్యుకేషన్ ట్రస్టు అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. పురసభ మాజీ సభ్యుడు ఎన్ భాస్కర్ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి కొనసాగుతున్న నగరేశ్వర స్వామి జాతర కాలానుగుణంగా మధ్యలో ఆగిపోగా ఇక్కడి నగర్త యువజన సంఘం, మహిళా సంఘం, మహంతి మఠం, భక్తుల సహకారంతో ఆలయాన్ని పునరుద్ధరించి సాంస్కృతిక శోభకు మెరుగు తెచ్చారన్నారు. భక్తుల హర్షధ్వానాల మధ్య రథోత్సవం గంగాతాయి దేవాలయ సర్కిల్ వరకు లాగారు. అనంతరం తిరిగి రాత్రి గాంధీ చౌక్‌కు యథాస్థానానికి తెచ్చారు. మహంతి మఠం అధ్యక్షుడు పునీత్‌కుమార్, ఆర్‌సీ మంజునాథ్, నగరేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి ట్రస్టు అధ్యక్షుడు దినేశ్, గౌరవాధ్యక్షుడు రుద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు నూతనంగా నిర్మించిన బలమురి గణపతి, భద్రకాళి సమేత రుద్రదేవుడి చిన్నరథాన్ని చిన్నారులు లాగారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆలంబగిరిలో వైభవంగా బ్రహ్మరథోత్సవం



ప్రత్యేక పూజల్లో ధర్మాధికారి ఎంఆర్ జయరాం దంపతులు తదితరులు



ఆలంబగిరిలో లక్ష్మీవెంకటరమణస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతామణి రూరల్, ఏప్రిల్ 23: తాలూకాలోని పవిత్ర యాత్రాస్థలమైన ఆలంబగిరి గ్రామంలో కొలువైన పురాణ ప్రసిద్ధ శ్రీలక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. చైత్ర పూర్ణిమ రోజున ఇక్కడ ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల గోవింద నామస్మరణతో రథోత్సవం సాగింది. రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. కైవార నుంచి అలంకరించిన పల్లకీలో సద్గురు తాతయ్య ఉత్సవమూర్తిని తెచ్చి ఆలయం ప్రాంగణంలో కొలువుదీర్చి శ్రీకృష్ణ గంధోత్సవ విశేషసేవను యోగినారేయణమఠం ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు నిర్వహించారు. ఆస్థాన సేవ అనంతరం భూనీళా సమేత శ్రీలక్ష్మీ వెంకటరమణస్వామి ఉత్సవమూర్తులను వేదఘోష నడుమ రథంపై కొలువుదీర్చారు. అనంతరం రథోత్సవం సాగింది. ఈ సందర్భంగా తేరుపై అరటిపండు, దవనం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు ఎడ్లబండ్లలో, ట్రాక్టర్లలో మజ్జిగ, పానకం, పెసరబేడలు పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల నీటి ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. యోగినారేయణమఠం తరపున అన్నసంతర్పణ సాగింది. కాగా ఆలంబగిరి గ్రామం లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయం నుంచి సుమారు కిలోమీటరు దూరంలోని కొండ చుట్టూ ప్రకృతి రమణీయత నడుమ సంకీర్తనా గిరి ప్రదక్షిణ సాగింది. గిరి ప్రదక్షిణలో కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవెంకటరమణస్వామి రథోత్సవం



రథంలో ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

బంగారపేట, ఏప్రిల్ 23: తాలూకాలో చారిత్రాత్మక నేపథ్యం కల్గిన బూదికోటె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీవెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వారం రోజులుగా ఆలయ ఉత్సవాలు సాగుతున్నాయి. ధ్వజారోహణతో ప్రారంభమైన ఉత్సవాలు తొలిరోజు సింహవాహనంపై స్వామివారు ఊరేగారు. అనంతరం హనుమంతఆహనం, శేష వాహనం, కాశీ ఉత్సవం, కళ్యాణోత్సవం, గరుడోత్సవం, గజేంద్ర మహోత్సవం తదితర ఉత్సవాలు సాగాయి. చైత్ర పూర్ణిమ రోజున మంగళవారం బ్రహ్మరథోత్సవం కనులపండువగా సాగింది. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం సాగింది. భక్తాదులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. ఉత్సవంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు బీఆర్ మంజునాథ్, సమాజ సేవకుడు కాంగ్రెస్ ముఖ్యుడు ఏ బాబు, బీ చంద్రశేఖర్, బీవీ కృష్ణ, నారాయణ శెట్టి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చేళూరు, ఏప్రిల్ 23: చైత్ర పౌర్ణమి నేపథ్యంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని కోదండరామస్వామి బ్రహ్మ రథోత్సవం వేడుకగా సాగింది. స్థానిక చింతామణి రోడ్డులోని మారుతి ఆసుపత్రి యజమాని అంబటి సోమసుందరం నేతృత్వంలో నరిహద్దులోని టి సదుం గ్రామంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం స్వామివార్లకు విశేషపూజల అనంతరం పుర వీధులలో రథోత్సవం సాగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, మజ్జిగ, పానకం, అన్నసంతర్పణ నిర్వహించారు.

నిర్భయంగా ఓటు వేయండి



పోలీసుల పథసంచలనం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని చింతామణి డీఎస్పీ మురళీధర్ వెల్లడించారు. ఈనెల 26న పోలింగ్ జరగనున్న తరుణంలో మంగళవారం పోలీసులు పథసంచలనం నిర్వహించారు. సుమారు 250మంది పారా మిలిటరీ సిబ్బంది, పోలీసులు పరేడ్‌గా సాగారు. మయూర సర్కిల్ నుంచి అశోక రోడ్డు మార్గంలో టీవీ రోడ్డు, అంబేడ్కర్ డబుల్ రోడ్డు దర్గా మీదుగా పోలీసులు పథసంచలనం సాగింది. ఎల్లమ్మదేవి ఆలయ సమీపాన యువకుల బృందం పోలీసులకు తాగునీరు, బిస్కట్ సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టౌన్ ఎస్సై వేణుగోపాల్, రూరల్ ఎస్సై సతీశ్, దిబ్బూరహళ్ళి ఎస్సై శ్యామలా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నగరంలో రూఫ్ ఇండియా ఎక్స్‌పో

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇండియా రూఫింగ్ విభాగానికి సంబంధించిన ఎక్స్‌పో నగరంలో ఈనెల 25నుంచి మూడు రోజులపాటు కొనసాగనుంది. కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా రూఫింగ్, క్లాడింగ్, ప్రి-ఇంజనీర్డ్ బిల్డింగ్, మెటల్ బిల్డింగ్ సిస్టమ్స్, గ్లోబల్ మార్కెట్ లీడర్స్, ఆధునాతన సాంకేతిక విభాగాలు ప్రదర్శనలో ఏర్పాటు చేయనున్నారు. 6 దేశాలనుంచి 200మంది ఎగ్జిబిటర్స్ పాల్గొననున్నట్టు హైవ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గగన్ సాహ్ని తెలిపారు. రూఫింగ్ సెగ్మెంట్‌లో 6.5శాతం వృద్ధి ఉందని 2029 నాటికి 10 బిలియన్ల లక్ష్యాన్ని సాధించదలిచామన్నారు. ప్రస్తుతం 7.5 బిలియన్ల టర్నోవర్ ఉందన్నారు. 21వ రూఫ్ ఇండియా ఎక్స్‌పో బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో జరగనుంది.

నేహా హత్యకేసు సీబీఐకి అప్పగించాలి

▸ విజయేంద్ర డిమాండ్

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని నేహా హిరేమఠ దారుణంగా హత్య చేసిన కేసును సీబీఐకు అప్పగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం విజయేంద్ర హుబ్బళ్ళిలోని నేహా తల్లిదండ్రులు నిరంజన్, గీతాలను పరామర్శించారు. మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కేసును కొనసాగించే విధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హత్యకు కారకులైన అందరినీ అరెస్టు చేయాలన్నారు. సీబీఐ ద్వారా దర్యాప్తుతో వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.



నేహా తల్లిదండ్రులను పరామర్శిస్తున్న విజయేంద్ర

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

శిడ్లఘట్ట, ఏప్రిల్ 23: హుబ్బళ్ళిలో విద్యార్థిని నేహా హిరేమఠ హత్యను ఖండిస్తూ తాలూకా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తాలూకా కార్యాలయం వద్ద నిరసన తెలిపాక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తాలూకా రూరల్ అధ్యక్షుడు సీకల్ ఆనంద్‌గౌడ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, శాంతి భద్రతలకు భంగం వాటిల్లాయన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయగౌడ, బీజేపీ రూరల్ తాజా మాజీ అధ్యక్షుడు సురేంద్రగౌడ, రూరల్ విభాగం మహిళా తాలూకా అధ్యక్షురాలు చాతుర్య, పట్టణ విభాగం మహిళా అధ్యక్షురాలు త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



తాలూకా కార్యాలయం వద్ద నిరసన

రాహుల్ దేశాన్ని పాలించాలని ప్రతి కార్యకర్త ఆశయం

▸ రణదీప్‌సింగ్ సుర్జేవాలా

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తన నాయకత్వాన్ని సమర్థవంతంగా సాగించారని దేశాన్ని పాలించాలని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆశయంగా ఉందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా అభిప్రాయపడ్డారు. మంగళవారం ఆయన బెంగళూరులో ఓ మీడియాతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని సమర్థవంతంగా నిభాయించారనేది నా అభిప్రాయం కాదని ప్రజల పట్ల సానుభూతి, ప్రజా సంబంధాలు, సామాన్యుల పట్ల ఆయనకున్న అభిమానం, నిబద్ధతల ప్రకారం ప్రతి కార్యకర్త ఆయనే దేశాన్ని ముందుకు నడిపించాలని భావిస్తున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆ కూటమి భావిస్తుందని, కాంగ్రెస్ లేదా ఐఎన్‌డీఐఏ కూటమి ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరని ప్రకటించడం లేదన్నారు. అయితే ప్రస్తుత ఎన్నికల పార్టీ ప్రణాళికలో ప్రధానమంత్రి ఎవరనేది నిర్ణయించలేదని అయితే సమిష్టిగానే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఒకే వ్యక్తి - దేశమంతటా ఒకే ధ్వని, ఒకే దేశం - ఒకే ఎన్నికలాంటివి పనిచేయవన్నారు. ప్రజలే రాష్ట్రానికి, దేశానికి యజమానులన్నారు. కులమతాలు, ప్రాంతీయ విబేధాలకు స్వస్తి పలికే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం వచ్చిందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో 20 స్థానాల్లో మా ఎంపీలు గెలుస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో మార్పు ఉండదని, కానీ బీజేపీ - జేడీఎస్‌లు మరింత కుశించనున్నాయన్నారు.

నేహా తల్లిదండ్రులను పరామర్శించిన మంత్రి పాటిల్

▸ ఫోన్‌లో మాట్లాడిన ముఖ్యమంత్రి

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో దారుణహత్యకు గురైన విద్యార్థిని నేహా తల్లిదండ్రులను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ పరామర్శించారు. మంగళవారం హుబ్బళ్ళిలోని నేహా తండ్రి నిరంజన హిరేమఠ, తల్లి గీతాలను పరామర్శించారు. ఇదే సందర్భంలోనే సీఎం సిద్దరామయ్య ఫోన్‌లో నిరంజన హిరేమఠతో మాట్లాడారు. మీ కుమార్తె దారుణ హత్యకు చింతిస్తున్నామని, మీ కుటుంబానికి అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఆ తర్వాత సొంత పార్టీ కాంగ్రెస్‌కు చెందినవారే వ్యతిరేకంగా మాట్లాడారని బాధపడ్డానని క్షమించాలని నిరంజన హిరేమఠ మంత్రివద్ద వాపోయారు. కాగా నేహా తల్లి గీతా హిరేమఠ మంగళవారం పోలీసులకు మరో ఫిర్యాదు చేశారు. కుమార్తెను కోల్పోయి బాధలో ఉంటే కొన్ని ఫోటోలను ప్రచారం చేస్తూ కుటుంబీకులకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కిరాతకంగా హత్యచేసిన హయాజ్ సోషల్‌మీడియా ఖాతానుంచే ఫోటోలు వైరల్ అవుతున్నాయని ఫిర్యాదు చేశారు.

కన్నబిడ్డను గమనించక కారు నడిపిన తండ్రి


▸ దుర్మరణం చెందిన చిన్నారి

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కన్నబిడ్డను గమనించికనే తండ్రి కారు నడపడంతో అకస్మాత్తుగా కారుకిందపడిన చిన్నారి దుర్మరణం చెందిన దారుణ సంఘటన నగరంలోని హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో చోటు చేసుకుంది. కుటుంబీకులంతా చెన్నపట్టణలోని ఓ వివాహనికి వెళ్ళి సోమవారం రాత్రి వెనుతిరిగి వచ్చారు. కుటుంబీకులంతా కారు దిగి లగేజీ తీసుకుని వెళ్ళడంతో తండ్రి పార్కింగ్ చేసేందుకు వెళ్ళారు. ఇదే సమయంలోనే ఇంటి నుంచి పరుగెత్తి వచ్చిన ఏడాదిన్నర చిన్నారి ఖైజా జన్నత్ డోర్ దగ్గరకు వచ్చేశారు. గమనించని తండ్రి కారు ముందుకు నడపడంతో ఒక్కసారిగా చిన్నారి చక్రాల కింద పడ్డారు. వెంటనే స్థానికులు కేకలు వేయడంతో కారును ఆపిన తండ్రి చిన్నారిని బయటకు తీసి ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కన్న తండ్రి గమనించకనే చిన్నారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. హెచ్‌ఎస్‌ఆర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు సత్యసాయిబాబా ఆరాధనోత్సవాలు

ఏర్పాట్లు పూర్తి.. భారీగా తరలివచ్చిన భక్తులు

పుట్టపర్తి, ఏప్రిల్ 23: సత్యసాయిబాబా ఆరాధనోత్సవాలు బుధవారం నిర్వహించనున్నారు. ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వేడుకల్లో కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఉదయం 8 గంటలకు విద్యార్థుల వేదపఠనంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. భక్తులకు నారాయణసేవ అందించడానికి హిల్‌వ్యూ స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాదాపు 30వేలమంది భక్తులు కూర్చోడానికి వీలుగా షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి సత్యసాయి విద్యార్థులు సాయికుల్వంత్ సభామండపంలో సాయిప్రేమ ఆరాధన పేరిట సంగీత కచేరి నిర్వహించారు. గంటపాటు మధుర గానంతో భక్తులను అలరింపజేశారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.83	1,577.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	162	269
సామర్థ్యం (టీఎంసీలు)	3.93	3.19

అంజనాద్రి పర్వతంపై ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

కంప్లి, ఏప్రిల్ 23 : హనుమజ్జయంతి సందర్భంగా పలుచోట్ల హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. కంప్లి, కురుగోడు, కుడితిని ప్రాంతాల్లో పలుచోట్ల ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆంజనేయస్వామి జన్మస్థలమైన అంజనాద్రి కి మాలాధారులు పోటెత్తారు. భక్తాదులు అధికసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనాద్రి పర్వతం భక్తులతో కిటకిటలాడింది. పూలు, పండ్లతో స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం



పీడీహళ్లి రామలింగేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 23 : తాలుకాలోని పీడీ హళ్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం జటింగ రామలింగేశ్వరస్వామి మహారథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. దుర్గమ్మ దేవస్థానం నుంచి ఎదురు బసవన్న దేవస్థానం వరకు భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి ఉదయాన్నే అర్చకులు శివకుమారస్వామి నేతృత్వంలో పూజలు నిర్వహించారు.

ప్రియాంక హెలికాప్టర్‌లో తనిఖీలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 23: ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిత్రదుర్గ నగరానికి విచ్చేసిన ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ప్రయాణించిన హెలికాప్టర్‌ను జిల్లా ఎన్నికల అధికారుల బృందం సోదా చేసింది. చిత్రదుర్గ పాత మాధ్యమిక పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సమావేశం ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ప్రియాంకా గాంధీ మంగళవారం మధ్యాహ్నం 3.25గంటలకు హెలికాప్టర్ ద్వారా చిత్రదుర్గకు వచ్చింది. ఈ సమయంలో అక్కడకు చేరుకున్న చిత్రదుర్గ విధాన సభ నియోజకవర్గం ఎన్నికల అధికారి ఎం.కార్తిక్ బృందం హెలికాప్టర్‌లో సోదాలు జరిపింది. ఈ సందర్భంగా తాహసీల్దారు నాగవేణి, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి అనంతరాజు, ఎఫ్ఎస్‌టి బృందం అధికారులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శంభులింగేశ్వరస్వామి మహారథోత్సవం

సిరుగుప్ప, ఏప్రిల్ 23 : అంగరంగ వైభవంగా మంగళవారం శంభులింగేశ్వర స్వామి మహారథోత్సవం జరిగింది. సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన శంభులింగేశ్వరస్వామికి ప్రతి యేడాది చైత్ర పూర్ణిమ నాడు మహారథోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా భక్తులు అగ్ని గుండ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు భక్తులు రథాన్ని లాగారు. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు.

బళ్లారిలో 'గాలి' వీచేనా?

- పట్టుకోసం 'జనార్దన్‌రెడ్డి' కుటుంబం కసరత్తు
- వినూత్నంగా ప్రచారం సాగిస్తున్న గాలి అరుణ
- రాజకీయ వ్యూహానికి పదును పెట్టిన మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి



ఒకే వేదిక పై ప్రచారం చేస్తున్న గాలి లక్ష్మిఅరుణ, గాలి సోమశేఖర్‌రెడ్డి

బళ్లారి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా దూరం అయి మళ్లీ కలిసిపోయిన ఒకే కుటుంబీకులను మనం చూస్తుంటాము. అలాంటిదే ఇప్పుడు బళ్లారి గాలి కుటుంబంలో కనిపిస్తోంది. 2023లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న జనార్దన్‌రెడ్డి సతీమణి లక్ష్మిఅరుణ, ఆయన సోదరుడు సోమశేఖర్‌రెడ్డి ప్రస్తుతం రాజకీయ వైరం వదిలి కలిసిపోయారు. బళ్లారిలో తిరిగి పట్టు సాధించాలని రాజకీయ ఎత్తులు వేస్తున్నారు.

కొంచెం వెనక్కు వెళితే మైనింగ్ అక్రమ కేసులో గాలి జనార్దన్ రెడ్డి బళ్లారి జిల్లాకు వెళ్లకుండా కోర్టు షరతులు విధించిన నేపథ్యంలో ఆయన బళ్లారికి రావడానికి వీల్లేకుండా పోయింది. దీంతో ఆయన కల్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) పార్టీ తరఫున గంగావతి నుండి పోటీ చేసి గెలిచారు. తన భార్య చేత బళ్లారిలో పోటీ చేయించారు. ఈ ఎన్నికల్లో కేఆర్‌పీపీ నుంచి పోటీ చేసిన ఆమె ఓడిపోయారు. కాగా గాలి సోమశేఖర్‌రెడ్డి ముందు నుంచి బీజేపీలోనే ఉన్నారు. ఆయన కూడా బీజేపీ నుంచి బళ్లారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఇద్దరూ బావా మరదళ్లు కావడంతో బీజేపీ ఓట్లు బాగా చీలిపోయాయి. ఒకే ఇంటివారు ఇద్దరూ పోటీలో ఉండడమే వీరి ఓటమికి కారణమైందని గాలి వర్గీయులు అప్పట్లో లెక్కలు వేశారు.

కాని గతేడాది గడిచిన రాజకీయం ఇప్పుడు మారిపోయింది. బీజేపీలో కేఆర్‌పీపీని విలీనం చేశారు. గాలి జనార్దన్‌రెడ్డి వర్గం అంతా బీజేపీలో చేరిపోయారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బి. శ్రీరాములు గెలుపునకు జనార్దన్‌రెడ్డి భార్య లక్ష్మిఅరుణ, గాలి సోమశేఖర్‌రెడ్డి తీవ్రంగానే కష్టపడుతున్నారు. ఇద్దరూ బళ్లారి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి బోర్లాపడ్డ వారే. ఏ ఓటరు ఎక్కడ ఉన్నాడో గాలి సోమశేఖర్‌రెడ్డికి బాగా తెలుసు. అందుకే ఆయన బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గెలుపునకు శ్రమిస్తున్నాడు. ఇక గాలి జనార్దన్‌రెడ్డి భార్య గాలి లక్ష్మిఅరుణ కూడా ప్రచారం కొనసాగిస్తూ ప్రత్యేక ఆకర్షణగా మారారు. మహిళలు, వ్యాపారులను కలుస్తూ బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్నారు.

బళ్లారి ప్రస్తుత ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ఆధిపత్యం తగ్గించాలంటే ఎంపీ ఎన్నికల్లో బళ్లారి నగరం నుంచి బీజేపీకి మెజార్టీ తేవాలని గాలి కుటుంబం ప్రయత్నిస్తోంది. మరోవైపు ఎమ్మెల్యే భరత్‌రెడ్డి కూడా తన నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తుకారాంకు మెజార్టీ తెప్పించాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. నగరంలో కాంగ్రెస్‌కు మెజారిటీ రాకుండా పోతే దానికి ఎమ్మెల్యే భరత్‌రెడ్డిని కారణంగా చూపించి అధిష్టానం వద్ద ఫిర్యాదు కూడా చేసేందుకు కాంగ్రెస్‌లో ఇప్పటికే ఒక వర్గం సిద్ధమైపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ఎమ్మెల్యే బళ్లారి నగరంలో మెజార్టీ నిలుపుకోవడం సందేహాస్పదంగా మారింది.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 23: బళ్లారి లోక్‌సభ స్థానానికి జూన్ 4న నగరంలోని రావుబహద్దూర్ మహాబలేశ్వరప్ప ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా స్ట్రాంగ్‌రూంను, ఓట్ల లెక్కింపు కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని మంగళవారం ఎన్నికల పరిశీలకుతో కలిసి సందర్శించిన ఆయన ఓట్ల లెక్కింపు సన్నాహాలను ఎన్నికల పరిశీలకులకు వివరించారు. బళ్లారిలో మే 7న లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత హడగలి, హగరిబొమ్మనహళ్ళి, కంప్లి, బళ్లారి (రూరల్), బళ్లారి (అర్బన్) సహా మొత్తం 8 నియోజకవర్గాల ఓటింగ్ యంత్రాలను ఇక్కడకు తీసుకువస్తారని తెలిపారు. సండూరు, కూడ్లిగి నియోజకవర్గాల ఓటింగ్ యంత్రాలను సండూర్ కూడ్లిగి కళాశాల భవనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ఓటింగ్ యంత్రాలను అత్యంత భద్రతతో పాటు నిబంధనల ప్రకారం ఉంచుతామని తెలిపారు. భవనంలో విద్యుత్ కనెక్షన్, భద్రత విషయంలో ఆయన అవసరమైన కొన్ని సూచనలు చేశారు. బళ్లారి లోక్ సభ ఎన్నికల పోలీసు పరిశీలకుడు ధర్మేంద్ర సింగ్ బదౌరియా, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు కూడా పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

బాలికా హత్యలపై చర్యలు తీసుకోవాలి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 23: రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న బాలికలపై వరుస హత్యలు పై ఏఎంఎస్ఎస్ మహిళా సంస్థ తరఫున జిల్లాకలెక్టర్ ద్వారా గౌరవ ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించారు.

మంగళవారం ఈసందర్భంలో ఏఐఎంఎస్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరీ మాట్లాడుతూ, హుబ్బళ్లి బీవీబీ కాలేజ్ విద్యార్థిని నేహా హిరేమఠ్ హత్య యావత్ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. తన ప్రేమను అంగీకరించలేదన్న ఒకే ఒక్క కారణంతో నిందితుడు ఆమెను తొమ్మిదిసార్లు కత్తితో పొడిచి హత్యగావించిన విషయం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మైసూర్‌లో రుక్సానా, కనపూర్‌లో నవ్య , దక్షిణ కన్నడ జిల్లాలో అక్షత, బెంగళూరులో లయస్మిత, ఉడిపిలో ఐనాజ్, ఇటీవల దారుణ హత్యకు గురయ్యారన్నారు. ఈ జాబితా పెద్దదవుతునే ఉందని, తన ప్రేమను అంగీకరించకపోవడంతో ఈ హత్యలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి దుశ్చర్యలు జరిగినప్పుడు దోషులను కఠినంగా శిక్షించి, ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అహల్య, గిరిజ, విజయలక్ష్మి, విద్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏఐఎంఎస్ఎస్ నేతలు, కార్యకర్తలు

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

- 15 ఏళ్లుగా పోలీస్ మైదానంలో పడివున్న ఇనుప ఖనిజం
- విలువ రూ.30 కోట్లపైమాటే



కుప్పలుగా పడి ఉన్న సీజ్ చేసిన ఇనుప ఖనిజం

బళ్లారి సిటీ,ఏప్రిల్ 23: గనుల నాడు బళ్లారిలో 2002 నుంచి 2011 వకు అక్రమ మైనింగ్ తారాస్థాయిలో జరిగేది. ఆ సందర్భంగా ఆటవీ శాఖ, భూవిజ్ఞాన ,పోలీస్ శాఖలు సంయుక్తంగా జరిపిన దాడుల్ల 77.378 టన్నుల ఖనిజం పట్టుబడింది. అక్రమ మైనింగ్‌లో పట్టుబడిన ఖనిజాన్ని సండూర్ ఆటవీ శాఖ ఆవరణలో భద్రపరిచారు. పదిహేనేళ్ల క్రితం పట్టుబడిన ఈ ఖనిజాన్ని విక్రయించి ప్రభుత్వ ఖజానాకు చేర్చాలి. సండూర్ పట్టణంలోని అటవీ, పోలీసు శాఖ మైదానాలు మాంగనీస్, ఇనుప ఖనిజం గుట్టలతో నిండిపోయాయి. గనులు, భూవిజ్ఞాన శాఖ ఖనిజ విక్రయానికి రెండుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో వారికి ఇదొక సవాల్‌గా మారింది. ఇందులో పట్టణంలోని ఆటవీశాఖ కార్యాలయం చుట్టుప్రక్కల భూమిలో 32వేల మెట్రిక్ టన్నులకు పైగా, పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న 6ఎకరాల విస్తీర్ణంలో 45,358మెట్రిక్ టన్నులకు పైగా ఖనిజం నిల్వ ఉంది. చైనా మార్కెట్‌లో ఖనిజం ధర విపరీతంగా పెరగడంతో పట్టుబడిన ఖనిజం విలువ రూ. 30.90కోట్లుకు పైగా ఉంటుందని అప్పటి గనులు, భూవిజ్ఞాన శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పుడు ఖనిజం ధర కొద్దిగా తగ్గినా ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు రావాల్సి ఉంది. ఈ ఖనిజాన్ని వేలం వేయాలని పర్యవేక్షణ కమిటీకీ గత ఐదేళ్లలో రెండుసార్లు ప్రతిపాదన సమర్పించారు. అయినా ఎవరూ ముందుకురాలేదు. మరోవైపు ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ ఖనిజం కొట్టుకుపోయి కాలువలోకి చేరుతోంది. 15 ఏళ్లక్రితం స్వాధీనం చేసుకున్న ఖనిజాన్ని ప్రస్తుతం లభ్యమవుతున్న ఖనిజానికి చాలా తేడా ఉంది. నిల్వఉంచిన ఖనిజంలో ఇనుము, మాంగనీస్ ఖనిజం ఉండేలా ఖచ్చితత్వం లేకపోవడంతో కానుగోలు దారులు ఈ టెండర్‌లో పాల్గొనేందుకు సుముఖంగా లేరని వినికిడి. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సౌత్ ఫారెస్ట్‌జోన్, ఆర్ఎఫ్ఓ గిరీశ్ కుమార్, నార్త్ ఫారెస్ట్ జోన్ ఆర్ఎఫ్ఓ సయ్యద్ దాదా ఖలందర్ తెలిపారు.

పలు వార్డుల్లో మంత్రి, ఎమ్మెల్యేల ప్రచారం



ప్రచారం చేస్తున్న లోక్‌సభ అభ్యర్థి తుకారామ్, జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్

బళ్లారిరూరల్, ఏప్రిల్ 23 : బళ్లారి నగరంలో 23వ వార్డు నాగప్ప కట్ట, మహానంది కొట్టంతో పాటు పలు వార్డుల్లో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి తుకారామ్‌తో పాటు ఆయన గెలుపుకోసం మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, వార్డు కార్పొరేటర్ పూజారి గాదెప్ప తదితరులు విస్తృత ప్రచారం చేపట్టారు. మంత్రి నాగేంద్ర, భరత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీల వల్ల లోక్‌సభ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో మంత్రి నాగేంద్ర మంగళవారం బూదేహాల్, గోడేహాళ్, అమరాపురం, కక్కబేవనహళ్లి, బేవనహళ్లి, అసొండి తదితర ప్రాంతాల్లో లోక్‌సభ అభ్యర్థి గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బుడా అధ్యక్షులు ఆంజనేయులు, మానయ్య, మంజుళ, మాజీ మేయర్ రాజేశ్వరి, ముల్లంగి నందీష్, రామాంజినేయులు, వన్నప్ప, డీసీసీ కార్యధ్యక్షులు బోయపాటి విష్ణువర్ధన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి శ్రీరాములు విస్తృత ప్రచారం



బీజేపీ అభ్యర్థి శ్రీరాములు, సోమశేఖర్‌రెడ్డికి గజమాలతో సత్కారం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 23 : బళ్లారి నగరంలోని 9, 17, 19 వార్డుల్లో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి సతీమణి లక్ష్మీ అరుణ, జేడీఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీనళ్లి తాయన్న విస్తృత ప్రచారం చేపట్టారు. బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోపాటు రాబోయే రోజుల్లో మన ప్రధాని నరేంద్రమోడీ అయితేనే దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తారని, దేశ రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్నవ్యక్తి మోదీ అని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రముఖులు పాలన్న, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు ఉమేష్, అడ్వకేట్ జాలేహాల్ గవిసిద్దప్ప, కార్పొరేటర్ కోనంకి తిలక్, ఓబులేసుతోపాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హంపీ విరూపాక్షేశ్వరుడికి ప్రత్యేక పూజలు



హంపీ పౌర్ణమి సందర్భంగా విరూపాక్షేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

బళ్లారి సిటీ. ఏప్రిల్ 23: హంపి విరూపాక్షేశ్వర జాతర సందర్భంగా స్వామికి పీఠాధిపతి విద్యారణ్య భారతి మంగళవారం పంచామృతాభిషేకం చేసి కృష్ణ దేవరాయల కాలం నాటి బంగారు తలపాగా అలంకరించారు. హంపిలోని భక్తాదులు, విదేశీయులు కూడా జాతర మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేశారు. హంపీ పూర్ణి మ సందర్భంగా విరూపాక్షేశ్వర రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

పోటెత్తిన భక్తులు

కంప్లి, ఏప్రిల్ 23: దక్షిణ కాశీగా పేరుపొందిన హంపి పుణ్యక్షేత్రానికి మంగళవారం మండుటెండను లెక్కచేయకుండా భక్తాదులు భారీగా తరలివచ్చారు. పౌర్ణమి సందర్భంగా విరుపాక్షేశ్వరస్వామికి, పంపాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పూజల్లో పాల్గొన్న భక్తాదులకు అన్నప్రసాదాలు కూడా పంపిణీ చేశారు.

మినీ ఫంక్షన్ హాలు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కమ్మసంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరావు

సిరుగుప్ప, ఏప్రిల్ 23 : సిరుగుప్ప పట్టణం బళ్లారి రోడ్డు మార్గంలోని కమ్మ సంఘం భవనం ప్రాంగణంలో మినీ ఫంక్షన్ హాలు పనులకు కమ్మసంఘం గౌరవాధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు మంగళవారం భూమిపూజ చేశారు. ఇంతకు ముందు కమ్మసంఘం భవనంలో అందరికీ సర్వహక్కులు కల్పించామని, ప్రస్తుతం ఆ నియమావళిలో కొద్దిగా మార్పిడి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిన్న పంక్షన్‌లకు, నాన్ వెజిటేరియన్ ఫంక్షన్లకు మినీ ఫంక్షన్ హాలును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 120-21 అడుగుల పొడవుతో ఈ హాలును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కమ్మసంఘం పదాధికారులు సత్యనారాయణ, తాతినేని ప్రసాద్, బసవరావు, సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

చైత్ర పౌర్ణమికి విశేష పూజలు



సర్వాలంకార యుక్తుడైన స్వామి వారు

హోసూరు, ఏప్రిల్ 23: చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని పలు ఆలయాలలో మంగళవారం విశేషపూజలు కొనసాగాయి. కృష్ణగిరి జిల్లా ఉద్దనపల్లి పంచాయతీలోని పాత కొత్తూరు రోడ్డులో సెల్వ కాళీయమ్మ, హనుమంతరాయ స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్, సెల్వకాళీయమ్మ, శివుడు, వెంకటాచలపతి, సుబ్రహ్మణి, వినాయకుడు, జడేమునీశ్వరుడు, నందీశ్వరుడు, గరుడాళ్వార్ తదితర ఆలయాల్లోపూజలు, అభిషేకాలు జరిగాయి.హోసూరు పరిసర ప్రాంతాల నుంచి పలువురు భక్తాదులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులందరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేడుకల ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త విజయకుమార్ పర్యవేక్షించారు.

ముత్తుమారియమ్మ ఆలయంలో విశేష పూజలు

హోసూరు (సిప్‌కాట్) ఏప్రిల్ 23: చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని బెంగళూరు జాతీయ రహదారి మార్గంలోని మారుతీ నగర్‌లో ఉన్న ముత్తుమారియమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. 301 లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలు రోగాల బారినుంచి విముక్తి పొందాలని ఇలా లోకసంక్షేమం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తదుపరి అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రంగన్నబాబు, కార్యదర్శి రాజి పాల్గొన్నారు.

ధర్మాచరణతోనే మానసిక ప్రశాంతత

హోసూరు, ఏప్రిల్ 23: ప్రస్తుత కాలంలో ధర్మాన్ని ఆచరించే వారు తగ్గుతున్నారని ధర్మాచరణతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వాములు అభిప్రాయపడ్డారు. చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని హోసూరు బాగలూరు రోడ్డులోని తాతయ్య ఆశ్రమంలో మంగళవారం పలు కార్యక్రమాలు కొనసాగాయి. తపోవన ఆశ్రమం అధ్యక్షుడు శ్రీనివాసులు పర్యవేక్షించారు. సాధువులకు దుస్తులు, కానుకలు అందజేసి అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రమణానందస్వాములు, శ్రీ చంద్రేశానందజీ పాల్గొని ప్రసంగించారు. బహ్మశ్రీ వెంకటేశ్వర స్వాములు భక్తాదులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి రోజూ ప్రసంగాలు ఇవ్వడానికి వీలు పడదని, అందుకే ఇలాంటి ప్రత్యేక పర్వదినాలో అందించే ప్రవచనాలను అందులోని అంశాలను అర్థం చేసుకుని పాటిస్తే జీవితంలో ప్రశాంతంగా ఉండవచ్చునన్నారు.

దాసనపురంలో ఎడ్ల ఉత్సవం

హోసూరు, ఏప్రిల్ 23: హోసూరు సమీపంలోని దాసనపురం గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎద్దుల సందడి సాయంత్రం వరకు సాగింది. తమిళనాడు నుంచే కాక పొరుగున ఉండే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రాల ప్రాంతాల నుంచి వందలాది ఎద్దులు పాల్గొన్నాయి. పదివేల మందికి పైగా ప్రజలు పాల్గొని వీక్షించారు. గుమిగుడారు. ఎద్దుల కొమ్ములకు రంగులు పూసి, అలంకరించి ఎద్దులను పరుగెత్తిస్తారు. ఎద్దులు దూసుకు పోతుండగా యువకులు పట్టుకుని నియంత్రించేందుకు ప్రయత్నిస్తారు. ఇలా సత్తా చాటిన వారికి తగిన బహుమతులు కూడా అందిస్తారు. అన్నాడీఎంకే శూలగిరి యూనియన్ కమిటీ సభ్యుడు జనార్ధకుమార్, పంచాయతీ కౌన్సిల్ కుమార్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు పాపయ్య, దాసనపురం ఆలయ ధర్మకర్త వెంకటేశ్, గోపాల్ గౌడు, మాజీ పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, నాగరాజ్ పాల్గొన్నారు.



దాసనపురంలో ఎడ్లపందేలు నిర్వహిస్తున్న దృశ్యం

అభివృద్ధి గ్యారెంటీకి అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్నరాయచూరు లోక్‌సభ అభ్యర్థి కుమార్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీకి కట్టుబడి గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్న నేపద్యంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ కోరారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాయచూరు తాలూకాలోని యాపలదిన్నిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో భారీ సమావేశం నిర్వహించారు. సభలో మాట్లాడిన రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ, గత ఏడాది కాలంగా నియోజక వర్గం అభివృద్ధి కోసం తాను చేస్తున్న ప్రయత్నం ప్రజలందరికి తెలసన్నారు. ఇదే రీతిలో లోకసభ అభ్యర్థిగా ప్రజల ముందుకు వచ్చిన జీ కుమార్ నాయక్‌కు అండగా నిలవాలని, అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలన్నారు. సమైక్యత, సమగ్రతతో పాటు అన్ని వర్గాల వారికి అండగా నిలిచే శక్తి ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. కుమార్ నాయక్‌కు అభివృద్ధి పట్ల పరిపూర్ణమైన అవగాహన ఉందని ఆయనకు అండగా నిలిచి నియోజక వర్గం అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

బొలెరో వాహనం ఢీకొని ముగ్గురు దుర్మరణం



అయ్యనగౌడ, మహేశ్,ఉదయ్(ఫైల్)

రాయచూరు, ఏప్రిల్ 23: రాయచూరు-హైదరాబాద్ అంతర్‌రాష్ట్ర రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు హనుమాన్ మాలాధారులు అక్కడికక్కడే మృతి చెందారు. రాయచూరు తాలూకాలోని హెగ్గసనహళ్ళి ఎంపీసీఎల్ కాలనీకి చెందిన 10 మంది హనుమాన్ మాలాధారులు మంగళవారం హనుమాన్ జయంతికి కృష్ణనది నుంచి నీటిని తెచ్చేందుకు పాదయాత్రగా బయలుదేరారు. వీరు రోడ్డుపై వెళుతున్న సమయంలోనే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఒకటి వీరిని ఢీకొట్టింది. దీంతోఅయ్యనగౌడ(30), మహేశ్(31),ఉదయ్ కుమార్(30)లు అక్కడికక్కడే మృత్యువాతపడగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. మిగిలిన మాలాధారులకు గాయాలుకాగా వారిని ఆస్పత్రికి తరలించారు.